సాక్షి
వికారాబాద్
గురువారం । 19 । జూన్ । 2025



రుణానికి ఎదురుచూపులు!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువవికాసం పథకం అమలు జాప్యమవుతుంది. 8లో▸



అనుమతి లేక.. ఆగిన రోడ్డు

దౌల్తాబాద్-రావల్‌పల్లి, కొడీడ్-దౌల్తాబాద్ వెళ్లే మార్గంలో అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. 8లో▸



ముహూర్తం ఖరారయ్యేనా?

గ్రామ పంచాయతీ ఎన్నికలు గతేడాది నుంచి ఇదిగో వచ్చే...అదిగో..అంటూ నోటిఫికేషన్ ఆలస్యమైంది. 9లో▸

న్యూస్‌రీల్

రేణుక ఎల్లమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు

తాండూరు రూరల్: మండల పరిధి కొత్లాపూర్ శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో మే మొదటి వారం నుంచి జూన్ 13న ఏరువాక పౌర్ణమి వరకు జాతర కొనసాగింది. బుధవారం ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌చందర్ రెడ్డి, ఈఓ శేఖర్ మాట్లాడుతూ.. రూ.4.47లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు రాజు, లాలయ్యగౌడ్, లక్ష్మి, లాల్యా నాయక్, శాంతప్ప, ఈశ్వరమ్మ, పరిశీలకులు శాంత్‌కుమార్, సిబ్బంది రవి, గ్రామస్తులు రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్: పెంచిన స్టూడెంట్ బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ.. ఏబీవీపీ నాయకులు బుధవారం ఆర్టీసీ తాండూరు డిపో మేనేజర్ సంతోశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి విద్యార్థులు పట్టణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులో వచ్చి వెళ్తుంటారని.. వారి బస్‌పాస్ చార్జీలు పెంచడంతో భారమైందన్నారు. పలువురు చదువుకు దూరమవుతున్నారన్నారు. వెంటనే బస్‌పాస్ చార్జీలు పెంచకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్, జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు, ఆకాశ్, ఆర్యన్, రాకేశ్ తదితరులు హెచ్చరించారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరండి

ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి శంకర్‌నాయక్



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న శంకర్‌నాయక్

దౌల్తాబాద్: పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులే ఉన్నత శిఖరాలను అధిరోహించారని.. ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని రాణించాలని సూచించారు. కళాశాలకు 12 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఇంగ్లిష్, తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌స్వామి, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి తదితరులున్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం బీఆర్‌ఎస్ ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: వ్యవసాయానికి కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు రైతులతో కలిసి గట్టుప్పలపల్లి సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలివీచినా గంటల తరబడి సరఫరా నిలిపేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం.. నాణ్యత శూన్యం!

రేషన్ బియ్యంలో 25 శాతానికి మించి నూకలు

- పురుగు, ఉల్లెడ వస్తున్నాయని లబ్ధిదారుల ఆగ్రహం
- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ
- జిల్లాలో 1,432 మెట్రిక్ టన్నుల రైస్ సరఫరా



నూకలు ఎక్కువగా ఉన్న సన్నబియ్యం

బషీరాబాద్: ప్రభుత్వం ఆహార భద్రత కింద పేదలకు అందజేస్తున్న సన్నబియ్యంలో నాణ్యత కొరవడింది. తెల్లపురుగులు, నూకలు, ఉల్లెడ వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లాకు నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి 1,600 మెట్రిక్ టన్నులకు పైగా సన్నబియ్యం ఇప్పటికే సరఫరా అయ్యాయి. అయితే నిజామాబాద్ నుంచి వచ్చే సన్నబియ్యంలో నాణ్యత లోపించిందని.. వనపర్తి బియ్యం కావాలని డీలర్లు అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

2.64 లక్షల మంది లబ్ధిదారులు

ఉగాది పర్వదినం రోజున ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 2.64 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతీ నెలా 5,604 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా అందజేస్తోంది. కాగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన కోటాను ఒకేసారి ఇవ్వాలనుంచి జూన్ 1వ తేదీ నుంచి సరఫరా షురూ చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,432 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు అందజేసింది.

నిజామాబాద్ నుంచి వచ్చిన బియ్యాన్ని నిరాకరిస్తున్న డీలర్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ బియ్యంలో 25 శాతం వరకు నూకలు ఉండొచ్చు. కానీ నిజామాబాద్ నుంచి వచ్చే సన్నబియ్యంలో 25 శాతం కంటే అధికంగా నూకలు ఉన్నట్లు లబ్ధిదారులు, డీలర్లు చెబుతున్నారు. లబ్ధిదారులు ఉల్లెడపట్టిన, పురుగుల బియ్యం ఎలా తినాలి అంటూ డీలర్లతో గొడవకు దిగుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యమే పంపిణీ చేస్తున్నామని.. ఏదైనా ఉంటే అధికారులకు చెప్పుకోవాలని సూచిస్తున్నారు.

సన్నబియ్యంలో పురుగులు



అంత్యోదయ కార్డు ద్వారా నెలకు 35 కిలోల బియ్యం వస్తాయి. నాలుగు రోజుల క్రితం 35 కేజీల బియ్యం ఇచ్చారు. మరో 70 కిలోలు రావాల్సి ఉంది. సన్న బియ్యంలో ఉల్లెడ, తెల్లపురుగులు, నూకలు ఉన్నాయి. బియ్యం కూడా దొడ్డుగా కనిపిస్తున్నాయి. అధికారులు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి.

– ఎడ్ల లలిత, నావంద్గి

బియ్యం సాంపిల్స్ పంపాం



నిజామాబాద్ నుంచి వస్తున్న సన్నబియ్యం నాణ్యతలేవని డీలర్ల నుంచి ఫిర్యాదులు అందాయి. ఆ సన్నబియ్యం సాంపిల్స్ సేకరించి సివిల్ సప్లై జిల్లా మేనేజర్ పరిశీలనకు పంపించాం. లబ్ధిదారులు నిజామాబాద్ నుంచి వచ్చిన బియ్యం తీసుకునేందుకు నిరాకరిస్తున్నారని డీలర్లు చెప్పారు. ఇదే విషయం ఉన్నతాధికారులకు వివరించాం.

– రవి, తాండూరు గోడౌన్ ఇన్‌చార్జి

విచారణ జరుపుతాం

ప్రభుత్వం పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందజేస్తోంది. నిజామాబాద్ సోనా మేలైన సన్న బియ్యం. కొంత మగ్గిన బియ్యం వస్తే రావచ్చు. అవి కూడా మంచివే. వాటితో పాటు వనపర్తి, బెల్లంపల్లి నుంచి జిల్లాకు దిగుమతి అయ్యాయి. ఈ నెలాఖరు వరకు అర్హులందరికీ అందజేస్తాం. ఎక్కడైనా నాణ్యత లేకుండా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి. వెంటనే టెక్నికల్ టీంతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ



ఎస్పీ నారాయణరెడ్డిని కలిసి బయటకు వస్తున్న వైద్య బృందం

గంజాయి.. జంగ్

- ఓ డాక్టర్ కారులో లభ్యమైన ప్యాకెట్
- పోలీసులే పెట్టారంటూ వైద్యుల ఆరోపణలు
- పోలీస్ వర్సెస్ వైద్యులుగా మారిన పంచాయితీ
- ఎస్పీని ఆశ్రయించిన డాక్టర్ల సంఘం

వికారాబాద్: జిల్లా కేంద్రంలో గంజాయి లొల్లి దుమారం రేపుతోంది. పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తున్న వైద్యుడి కారులో గంజాయి ప్యాకెట్ లభ్యమైందని పోలీసులు పేర్కొంటున్నారు. పట్టణ కేంద్రంలో రాష్ట్ర పోలీస్ డీజీపీ జితేందర్ విలేకరుల సమావేశంలో డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యమని ప్రకటించిన రోజునే వైద్యుడి కారులో గంజాయి పట్టుబడింది. దీంతో ప్రజలు పోలీసులపై ప్రశంసలు కురిపిస్తుండగానే కేసు పక్కదారి పట్టింది. మంగళవారం రాత్రి వైద్యుడి కారులో గంజాయి లభించగా.. ఇదే విషయమై డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో పలువురు వైద్యులు బుధవారం ఎస్పీ నారాయణరెడ్డిని కలిశారు. పోలీసులు దురుద్దేశంతోనే కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఈ విషయం ప్రస్తుతం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. కొందరు పోలీసులను ప్రశంసిస్తుండగా.. వైద్యుల వాదనలు విన్నాక పలువురు ఆరోపణలు చేస్తున్నారు.

వీడియో రికార్డు బయటపెట్టండి

ఉదయం ఎస్పీ నారాయణరెడ్డిని కలిసిన వైద్యుల సంఘం సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసులే తమ వాహనంలో గంజాయి ప్యాకెట్ పెట్టి తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ఎప్పుడూ లేని విధంగా అర్ధరాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారన్నారు. ఒక వేళ గంజాయి లభ్యమై ఉంటే వీడియో రికార్డు ఉంటుందని.. అది బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలను బయట పెట్టాలని కోరుతున్నారు.

లేడీ డాక్టర్‌పై ఆరోపణలు

తాము రాత్రి 8.30గంటల నుంచి వాహనాల తనిఖీ చేపట్టామని 9.30–10గంటల ప్రాంతంలో ఎస్‌ఐ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలోనే డాక్టర్ కారు రావడంతో డిక్కీలో తనిఖీ చేయగా ఓ బ్లాక్ కవర్‌లో గంజాయి లభ్యమైందని పోలీసులు పేర్కొంటున్నారు. వైద్యుల ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపడేస్తున్నారు. ఇదిలా ఉండగా.. స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తున్న వైద్యురాలే ఈ మొత్తం ఘటనకు కారణమని కొందరు వైద్యులు ఆరోపిస్తున్నారు. ఆమెతో సన్నిహితంగా ఉండే ఓ డివిజన్ స్థాయి పోలీస్ అధికారి తన కింది స్థాయి సిబ్బందితో ఈ డ్రామా ఆడించారని ఆరోపిస్తున్నారు.

పరిగి ఘటన మాదిరిగానే..

పరిగిలో ఓ మెడికల్ షాప్ నిర్వాహకుడికి చెందిన కారులో గంజాయి ఉందనే సమాచారంతో పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. కాగా మెడికల్ షాప్ నిర్వాహకుడు కావాలనే తన కారులో గంజాయి పెట్టి తనను ఇరికించేందుకు యత్నిస్తున్నాడని మరో యువకుడిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారించగా.. చివరకు వేరే వ్యక్తి కారులో గంజాయి ఉంచినట్లు సీసీ ఫుటేజీలో బయటపడింది. కాగా పోలీసులే ప్రమోషన్ కోసం తనతో గంజాయి పెట్టించారని యువకుడు ఆరోపించాడు. దీన్ని పోలీసులు ఖండించారు.

వైద్యుడిపై కేసు

సాధారణ తనిఖీల్లో భాగంగానే మంగళవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించాం. ఆ సమయంలో వైద్యుడు ప్రదీప్ తన కారులో ప్రయాణిస్తుండగా ఎస్‌ఐ వాహనాన్ని తనిఖీ చేశారు. నేను కూడా సమీపంలోనే ఉన్నాను. కారు డిక్కీలో ఓ బ్లాక్ కవర్ ఉండడం గమనించి బయటకు తీసి చూడగా గంజాయి లభించింది. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

– భీంకుమార్, సీఐ, వికారాబాద్

పంద్రాగస్టులోగా పరిష్కారం చూపండి



కొడంగల్: మాట్లాడుతున్న సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

తాండూరు సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

కొడంగల్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతులు దరఖాస్తులు చేసుకున్న సమస్యలకు పంద్రాగస్టులోగా పరిష్కారం చూపాలని తాండూరు సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 18 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో 348 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని.. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 15 లోగా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఐఐటీ పేరుతో దందా’..

తాండూరు టౌన్: ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని భాష్యం జూనియర్ కళాశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ పేరుతో కొనసాగుతున్న దందాను అడ్డుకోవాలని ప్రజా, విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు తాండూరు సబ్-కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్ సాధారణ తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలో ఐఐటీ, నీట్, సీఏ, సీపీటీ బోధిస్తామని సంకల్ప్ ఏసీ అకాడమీ పేరుతో కోచింగ్ సెంటర్ నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ కోచింగ్ పేరిట విద్యార్థుల నుంచి రూ.60 నుంచి రూ.70వేలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా కళాశాలలో కోచింగ్ సెంటర్ నిర్వహించడం సరికాదన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను కోచింగ్ పేరిట మోసగిస్తున్న భాష్యం కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని ఎడల ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేయడంతో పాటు విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి కళాశాల ఎదుట ఆందోళన చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, స్వేరో జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల బంట్వారంలో హావర్లీ బేస్డ్ ప్రకారం ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న అర్హులు పూర్తి వివరాలతో బయోడేటా అందజేయాలని ఆమె సూచించారు.

కుదురుమల్ల నుంచే కాంగ్రెస్ పతనం

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- గులాబీ గూటికి చేరిన హస్తం, బీజేపీ శ్రేణులు

దుద్యాల్: కుదురుమల్ల నుంచే కాంగ్రెస్ పతనం ప్రారంభమని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. మండల పరిధిలోని గౌరారం గ్రామంలో ఓ ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో విసిగిన ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఓట్లు వస్తేనే రైతులు గుర్తుకు వస్తారన్నారు. యాసంగి రైతు భరోసాకు లేని నిధులు స్థానిక సంస్థల ఎన్నికల ముందు వానాకాలం పంటలకు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ పార్టీ నేతలకే అందిస్తున్నారని ఆరోపించారు. ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు గ్యారంటీ కార్డు చూపి నిలదీయాలన్నారు. కుదురుమల్ల గ్రామానికి చెందిన మడిగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంత మంది పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దుద్యాల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్ మండల అధ్యక్షులు చాంద్ పాషా, యాదగిరి, మహిపాల్, దామోదర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బొగమోని సురేశ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నరేశ్ గౌడ్, నాయకులు మధుసూదన్ యాదవ్, నారాయణరెడ్డి, బుగ్గప్ప, బాబర్, రమేశ్ బాబు, కేశ రెడ్డి, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నరేందర్‌రెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సుబ్బారావు

యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ సుబ్బారావు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ వీసీ వీఎల్‌వీఎస్‌ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు కృషిచేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్ రంగానికి చెందిన కంపెనీలతోపాటు వివిధ రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు హాజరయ్యాయరని తెలిపారు. 142 మంది నిరుద్యోగులు వివిధ కంపెనీలకు సంబంధించి ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె.సుధాకర్, బీఎఫ్‌ఎస్‌ఐసీఓఓ సౌమ్యారంజన్, బీఎఫ్‌ఎస్‌ఐ ట్రైనర్ శ్రీనాథ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ టి.రాంబాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్, కళాశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బాధ్యతలు మోయలేం

- విధులు బహిష్కరించిన పంచాయతీ కార్యదర్శులు
- జీపీ కార్యాలయాలు, ట్రాక్టర్ల తాళాలు ఎంపీడీఓకు అప్పగింత

దోమ: నిధుల లేమి, ఆర్థిక వనరులు లేని పంచాయతీల నిర్వహణ బాధ్యతలను తాము మోయలేమని పంచాయతీ కార్యదర్శులు తేల్చిచెబుతున్నారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లా దోమ మండలంలోని 36 జీపీలకు సంబంధించిన సెక్రటరీలు.. బుధవారం పంచాయతీ కార్యాలయాలు, ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీఓ గ్యామాకు అందజేశారు. ఆర్థికపరమైన విధులు చిరుద్యోగులైన తమకు తలకు మించిన భారంగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటినుంచి తప్పుకొంటున్నామని ఎంపీడీఓకు తెలిపారు.



ఎంపీడీఓ గ్యామాకు పంచాయతీ తాళాలు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రూ.2 లక్షల అప్పు చేశా



గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు, గడ్డిమందుల పిచికారీ, మోటార్లు, భగీరథ పైప్‌లైన్ల మరమ్మతులు, ట్రాక్టర్ల నిర్వహణ, అత్యవసర పనుల కోసం రూ.2 లక్షల వరకు ఖర్చుచేశా. తెచ్చిన డబ్బులకు వడ్డీ పెరుగుతోంది. బిల్లులు రావడం లేదు.

– మీన, పంచాయతీ కార్యదర్శి, బొంపల్లి

చేసిన పనులకు బిల్లులు రాలే..



ప్రతీ గ్రామంలో పనిచేస్తున్న కార్యదర్శులు అప్పులు తెచ్చి పనులు చేయించారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కనిపించడం లేదు. దీంతో చేసేది లేక ఆర్థికపరమైన బాధ్యతలు మోయలేమని చెబుతున్నాం.

– మొగులయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

లారీకి లోపం.. వాహనదారులకు శాపం



వికారాబాద్ బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ రైల్వే బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ట్రాఫిక్ జాం అయింది. అటుగా వెళ్తున్న ఓ లారీ సాంకేతికలోపంతో ఆగిపోవడంతో ఒక్కసారిగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. కాగా అరగంటకు పైగానే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ప్రస్తుతం నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డుపై విరిగిపడిన భారీ వృక్షం



పూడూరు: భారీ వర్షానికి మండలంలోని వికారాబాద్–మన్నెగూడ దారిలో హిట్స్ కాలేజీ సమీపంలో బుధవారం ఓ వృక్షం నెలకొరిగింది. చెట్టు పడిన సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎప్పుడు వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డుపై భారీ చెట్టు పడటంతో గంటకుపైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నాణ్యత లేకుంటే సహించం

టేకులగడ్డతండా పాఠశాలకు జిల్లా సివిల్ సప్లై అధికారులు



పాఠశాలలో సన్నబియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: నాసిరకం భోజనంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ‘సర్కారు బడికి.. నాణ్యత లేని సన్నబియ్యం’ అనే శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని టేకులగడ్డతండా ప్రాథమిక పాఠశాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌కృష్ణ, డీఎం మోహన్ బాబు, డీసీడీఎం గణపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయిన సన్నబియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. బియ్యంలో పురుగులు కనిపించి అవాక్కయ్యారు. స్థానిక ఎంఈఓ హరిలాల్, హెచ్‌ఎం గోపాల్‌ను కారణాలు అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నబియ్యం నాణ్యత లేకుంటే సహించేది లేదంటూ హెచ్చరించారు. పాత స్టాక్ కింద మిగిలి ఉన్న సన్నబియ్యాన్ని తిరిగి పంపించాలని సివిల్ సప్లై అధికారులు ఎంఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్, సీఆర్‌పీ సోమ్లా, హెచ్‌ఎం గోపాల్ ఉన్నారు.

మేకల దొంగలకు రిమాండ్



పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

పూడూరు: మేకల దొంగలను రిమాండ్‌కు తరలించిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పోతిరెడ్డిగూడలో వారం క్రితం మేకలు అపహరణకు గురవడంతో బాధితుడు ఫిర్యాదు చేశాడు. నిఘా పెట్టి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఏకేందర్‌సింగ్, మహమ్మద్ వాజీద్, షేక్‌సోహెల్ ముగ్గురు కలిసి కారును అద్దెకు తీసుకుని నగరం చుట్టుపక్కల సంగారెడ్డి, షాద్‌నగర్, ఆదిబట్ల, చెన్‌గోముల్ ప్రాంతాల్లో తిరుగుతూ మేకలను కారులో ఎత్తుకెళ్లేవారని తెలిపారు. వాటిని జియాగూడలో విక్రయించి జల్సా చేసేవారు. ఈ క్రమంలో బుధవారం దొంగతనం చేసేందుకు వస్తుండగా మన్నెగూడ చౌరస్తాలో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానంగా కారులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారు. నాలుగు మేకలు, రూ.42వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుణానికి ఎదురుచూపులు!

రాజీవ్ యువ వికాసం అమలులో తీవ్ర జాప్యం

- దరఖాస్తులు, విచారణ పూర్తయినా ముందుకు సాగని వైనం
- నిరాశ చెందుతున్న నిరుద్యోగులు



దౌల్తాబాద్‌లో యువవికాసానికి దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు (ఫైల్)

దౌల్తాబాద్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువవికాసం పథకం అమలు జాప్యమవుతుంది. యువతకు స్వయం ఉపాధి మార్గంలో నడిపించే సదాశయంతో యువ వికాసం పథకాన్ని జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించాలని హడావుడి చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అర్హుల ఎంపిక పూర్తి చేశారు. జూన్ 2న మంజూరు పత్రాలు అందిస్తామని ప్రకటించిన అధికారులు ప్రభుత్వ నిర్ణయంతో వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు మంజూరు పత్రాలు అందిస్తారో ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు ఒకింత నిరాశకు గురవుతున్నారు.

సబ్సిడీ ఇలా

పథకంలో రూ.50 వేల యూనిట్‌కు వందశాతం సబ్సిడీ, రూ.లక్ష వరకు 90శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80శాతం సబ్సిడీ, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70శాతం సబ్సిడీ, ప్రభుత్వం అందించనుంది. ఈ నాలుగు కేటగిరీల్లో రూ.50వేలు, రూ.లక్ష యూనిట్లకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తుంది. కానీ చాలా మంది రూ.2 నుంచి రూ.4లక్షల యూనిట్లు తీసుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు రూ.50 వేలకు స్థిరమైన ఉపాధి కల్పన సాధ్యం కాదని నిరుద్యోగులు బాహాటంగానే చెబుతున్నారు.

సిబిల్‌కే బ్యాంకర్ల ప్రాధాన్యం

యువ వికాసం దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీఓల ఆధ్వర్యంలో పరిశీలించారు. తొలుత మండల కమిటీల ఆమోదం తర్వాత జిల్లా కమిటీలకు జాబితా చేరింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే ఈ పథకం మంజూరు చేస్తారు. గతంలో ఏదైనా కార్పొరేషన్ నుంచి లబ్ధి పొందారా..? బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉన్నారా? అనే విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. అయితే ప్రభుత్వం సిబిల్ స్కోర్ పట్టించుకోవద్దని ప్రభుత్వం సూచించింది. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌ల కింద 1,900 దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఎవరికి అందుతాయోనని దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదేశాలు రావాలి

మండలంలో యువవికాసం కింద 1,900 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో ఉన్నతాధికారుల సూచనల మేరకు అర్హుల ఎంపిక కూడా జరిగింది. ఈ పథకం అమలు నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన చెట్లు



విద్యుత్‌ను నియంత్రించే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లపొదలు పెరిగి ఆన్ ఆఫ్ చేసేందుకు అవరోధంగా మారింది. వర్షాకాలంలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉండడంతో స్థానికులు కలవరపడుతున్నారు. ఈ దుస్థితి మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో దర్శనమిస్తోంది. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– మోమిన్‌పేట

21న యోగా దినోత్సవం

ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్షా అభియాన్, పాఠశాల విద్యాశాఖ నుంచి తనకు బుధవారం ప్రొసీడింగ్స్ వచ్చాయని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7.45 గంటల వరకు యోగా తరగతులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక, ఉన్నత, జిల్లా పరిషత్, కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులతో యోగా చేయించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. నియోజవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నియమాలకు లోబడి ఫీజులు వసూలు చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్, దుస్తులు, నోట్ పుస్తకాలు తదితర సామగ్రిని పాఠశాలలో అమ్మరాదని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సులతో పరిష్కారం



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతా సింగ్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, మాజీ సర్పంచులు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ ఎక్‌బాల్, ప్రధానోపాధ్యాయుడు పాండు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దుద్యాల్: విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఎంఈఓ విజయ రామారావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024–2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన ఉత్తమ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో మొదటి, ద్వితీయ పురస్కారాలు అందిస్తామని చెప్పారు. మండలంలో కుదురుమల్ల, దుద్యాల్, హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

పాము, కుక్క కాటుకు మందులు

హకీంపేట్ పీహెచ్‌సీ డాక్టర్ వందన



దుద్యాల్: పాము, తేలు, కుక్క కాటుకు హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔషధాలు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ వందన తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వం అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో రైతులు అధికంగా పొలం పనులకు వెళ్తుంటారన్నారు. చలువతో పాము, తేలు కాటుకు గురవుతుంటారు. అలాంటి బాధితులకి పీహెచ్‌సీలో చికిత్స అందుతుందని పేర్కొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్‌బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

బొంరాస్‌పేట: పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సన్నబియ్యం పక్కదారి పడుతోంది. తప్పుడు లెక్కలతో సన్నబియ్యం పోగు చేసుకొని అక్రమదందాకు ఒడిగడుతున్నారు. బుధవారం తాండూరుకు చెందిన వడ్ల మోహన్ బొలేరో వాహనంలో సన్నబియ్యంతో వెళ్తుండగా స్థానిక పోలీసులు పట్టివేశారు. సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

అనుమతి లేక.. ఆగిన రోడ్డు



దౌల్తాబాద్ శివారులో విస్తరణకు నోచుకోని రోడ్డు

దౌల్తాబాద్: అసంపూర్తి రోడ్డుతో మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దౌల్తాబాద్ నుంచి రావల్‌పల్లి వెళ్లే దారిలో, కొడీడ్ నుంచి దౌల్తాబాద్ వెళ్లే మార్గంలో అటవీశాఖ అనుమతులు లేక రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దౌల్తాబాద్ నుంచి రావల్‌పల్లికి నాలుగు వరుసల రహదారి మంజూరైంది. రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, అటవీ ప్రాంతం ఉన్న కిలోమీటర్ మేర అనుమతులు లేక నిలిచిపోయాయి. అలాగే బాలంపేట– అల్లాపూర్, గుండేపల్లి– అల్లాపూర్ మీదుగా గుముడాల వరకు ఉన్న అటవీ ప్రాంతంతో కూడా అనుమతులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడంతో అటవీశాఖ అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించి, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవారికి సొంతింటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు అందిస్తున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.84 లక్షలతో బాలసదనం భవనం ప్రారంభించి మాట్లాడారు. రూ.25 కోట్లతో సీసీ రోడ్లు పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు లాల్‌కృష్ణ, హన్మంతు, ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ మండల అధ్యక్షురాలు అనసూయ



కేంద్ర సంక్షేమాలను వివరిస్తున్న అనసూయ

పరిగి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గడిసింగాపూర్, రూప్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో బీజేపీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. 11 ఏళ్లలో దేశం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. డిజిటల్ ఇండియా, మేకిన్ ఇండియాలో భాగంగా ప్రపంచ దేశాలకు సవాలు విసురుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్డు, ఇతర పనులు మొత్తం కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంటికి ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యంతో సింహభాగం కేంద్రానిదే అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాముయాదవ్, నాయకులు రమేష్, వీరేష్, అశోక్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సేవలు అభినందనీయం



స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించిన ఒబేదుల్లా కొత్వాల్

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

తాండూరు టౌన్/తాండూరు రూరల్: యువతీ యువకుల కోసం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముస్లిం వెల్ఫేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ సేవలు అభినందనీయమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ కొనియాడారు. బుధవారం ఆయన సొసైటీ ఆధ్వర్యంలో యువతులకు కొనసాగుతున్న కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో యువతీ యువకులకు, విద్యార్థులకు ఎప్‌సెట్, టెట్, డీఎస్సీ కోచింగ్, మెహందీ, కుట్టు మిషన్ శిక్షణ తదితర సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కమాల్ అతర్, ఉపాధ్యక్షుడు బాసిత్ అలీ, కార్యదర్శి మహ్మద్ యూనిస్, కోశాధికారి సిరాజ్, అబ్దుల్ సలీం, అబ్దుల్ ఖవి, ఖయ్యూమ్ అతర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



చెన్‌గేస్‌పూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన ఎరుకల శారద బస్వరాజ్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నానిగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్ కులంపేరుతో దూషించి దాడి చేశారని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. డీఎస్పీ సంఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు. ఆయన వెంట కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

దుద్యాల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోస్గి మండలం లోదిపూర్ నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి

- డీపీఓ సురేష్‌మోహన్
- దండుమైలారంలో పర్యటన



దండుమైలారంలో మొక్కలు నాటేందుకు తీసిన గోతులను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌మోహన్

ఇబ్రహీంపట్నం: వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్ సూచించారు. బుధవారం దండుమైలారం గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీ, డంపింగ్‌యార్డును, వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు ప్రబలే అవకాశముంటుందన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎస్ రఘు, పంచాయతీ కార్యదర్శి పి.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాతో కలిసి కుట్టు మిషన్ల పంపిణీ



బషీరాబాద్: మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్ మహరాజ్‌తో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ నుంచి మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు రుణాలు, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాలతో ఆర్థికంగా మేలు చేకూరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి నాయకులు తదితరులున్నారు.

ఉచితంగా కంది విత్తనాలు

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయనఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు నియోజకవర్గంలోని రైతులకు ఉచిత కంది విత్తనాల పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంది పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం నాణ్యమైన కంది విత్తనాలను ఉచితంగా అందిస్తోందన్నారు. రైతులు గ్రామాలలోని రైతు వేదికల వద్దకు వెళ్లి విత్తనాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ధారాసింగ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, రైతులు తదితరులున్నారు.

మహిళలను మహారాణులను చేస్తాం

బషీరాబాద్: రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 70 మంది మహిళలకు ఎమ్మెల్యే కుట్టుమిషన్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించేలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి బాధ్యత అప్పగించామని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చి వ్యాపారులుగా తయారు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ అల్పసంఖ్యాక మహిళ శక్తి –రేవంత్ అన్నాకా భరోసా పథకం ద్వారా 18 మంది ముస్లిం మహిళలకు కుట్టుమిషన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ కరుణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్‌ల జిల్లా అధికారులు బాబుమోజెస్, రాజేశ్వరి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంతిభాయి. నాయకులు శంకరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, సురేష్, మాణిక్‌రావు, సతీష్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.